1. జి. రామారావు.
నెహ్రూనగర్
ఉండ్రాజవరం

2. విన్నకొండ సుబ్రహ్మణ్యం
చందనంవారి వీధి.
శ్రీకాకుళం.

ఈ రెండు ఊళ్ళూ నాకు బాగా తెలుసు. ఆ ఊళ్ళో సదరు వీధులు లేవు. అక్కడ దంపతులకి ఇతని వల్ల పిల్లలు పుట్టారన్నది అబద్ధం".

మధూహ ఊపిరి బిగపట్టింది. ఆమెకు లోపల్నుంచి ఆవేశం తన్నుకొస్తోంది. "ఎలా ?.... ఎలా దీన్ని బయటపెట్టటం" అంది స్వగతంగా.

" చాలా కష్టం. చట్టబద్ధంగా మనం ఏమీ చేయలేం. విశాల్ క్లినిక్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటే పిల్లలు పుట్టరనీ, కేవలం పేషెంట్లని ఆకర్షించటానికే ఈ విధమైన ప్రకటనలు గుప్పిస్తాడనీ నిరూపించటానికి మనవద్ద సాక్ష్యాలు లేవు. ఇక మనం చేయగలిగిందల్లా విశాల్ క్లినిక్ ముందు నిలబడి ఇక్కడికి ఎవరూ వెళ్ళొద్దు అని అరవాలి రోజంతా. అప్పుడు గానీ మనిద్దర్నీ పిచ్చాసుపత్రిలో చేర్పించరు" అంటూ నవ్వాడు.

ఆమె నవ్వలేదు. స్తబ్దుగా కూర్చుండిపోయింది.

ఆ క్షణం ఆమె ప్రపంచం కోసం దుఃఖించింది. ఎంతమంది అమాయకులు. వీరికి జ్ఞానం ఎలా వస్తుంది? ఎంతమంది సంస్కర్తలు హేతువు గురించి ఎంత బోధించినా ఎంతమంది రచయితలు తర్కం గురించి ఎంతవ్రాసినా ఈ సమాజం ఇలాగే వుంటుంది.

కాదు. ఎవరో మారతారు. ఒక్కరు మారినా చాలు ఒక్కరు తెలుసుకున్నా చాలు. వారి కోసమైనా దీన్ని చివరికంటా శోధించాలి.

ఆమె దృఢ నిశ్చయంతో లేచింది.

అయితే ఇంటికొచ్చేసరికి పరిస్థితి మరోలా వుంది.  సోమం ఇంటిలో లేడు. ఒక ఉత్తరం మాత్రం వుంది.

"వదినా
నేను ఇల్లు వదిలి వెళ్ళిపోతున్నాను. తల్లీ తండ్రీ పోయాక స్వంత తమ్ముడిలా ఆదరించావు. కానీ నాకే నీ తమ్ముడయ్యేటంత అర్హత లేదు.

ఒక అన్యాయం జరుగుతోంది. దానివల్ల నీకేం నష్టం లేదు. దానితో నీకే సంబంధమూ లేదు. అయినా దాన్ని ఎదుర్కొనేటందుకు నువ్వు ఎంత శ్రమిస్తున్నావో నాకు తెలుసు. ఒక దారుణాన్ని వెలుగులోకి తీసుకురావటానికి నువ్వెంత తపిస్తున్నావో కళ్ళారా చూశాను. న్యాయం కోసం పోరాడిన లాయరుగారు కాళ్ళు రెండూ పోగొట్టుకుని ఆస్పత్రి మంచం మీద పడివున్న  దృశ్యం ఇంకా నా కళ్ళల్లో కదుల్తోంది.

చాలా మంది తెలివైనవాళ్ళు మోసం చేస్తుంటే మీలాంటి వాళ్ళు కొద్దిమంది దాన్ని ఎదుర్కోవటం కోసం పోరాడుతూంటే మాలాంటి అమాయకులం తెలివిని పెంచుకోవటం కోసం మైండ్ హిప్నో క్లినిక్‌లని ఆశ్రయిస్తాం.

వదినా! మా వూళ్ళో కొందరు యువకులున్నారు. జరుగుతున్న అన్యాయాన్ని చట్టపరంగా ఎదుర్కోలేనప్పుడు ఆ బాధ్యతని వాళ్ళు చేపడతారు. నేను వాళ్ళ దగ్గరకి వనాల్లోకి వెళుతున్నాను. వెళ్ళిబోయే ముందు ఇంకో  చిన్న పని పూర్తి చేస్తాను.

ఇంకో రెండు నిమిషాల్లో ఈ ఉత్తరం ముగించి విశాల్ క్లినిక్‌కి వెళ్తాను. అతనికి చిన్నపాఠం చెప్పటం కోసం....

...... సోమం

ఆమెకేదో అర్థమయింది. సోమం ఏదో దారుణం తలపెట్టబోతున్నాడని అర్థం కాగానే నో అని అరుస్తూ దాదాపు బయటకు పరుగెత్తింది.

ఆమె విశాల్ క్లినిక్ చేరుకునేసరికి పదినిముషాలు పట్టింది.

సరిగ్గా అదే సమయానికి డాక్టర్ విశాల్ రాజుతో కలిసి క్లినిక్ తలుపు మూసి మెట్లు దిగుతున్నాడు.

ఆమె ఏదో అనబోయేటంతలో కిళ్ళీ బడ్డీ వెనుకనుంచి సోమం వేగంగా ముందుకొచ్చాడు.

అది గమనించి మధూహ గట్టిగా అరవటం, ఈ లోపులో సోమం తన చేతిలో సీసాలో వున్న ద్రవం డాక్టర్ విశాల్ మీదకి విసరటం ఒకేసారి జరిగాయి.

ఏం జరుగుతోందో తెలియని రాజు అప్రయత్నంగా ముందుకు రావటంతో ఆ ద్రవం అతడి మొహం మీద పడిపోయింది.

ఊహించని ఈ పరిణామానికి సోమం కూడా బిత్తరపోయినా, వెంటనే తేరుకుని మిగతాదాన్ని విశాల్ మొహం మీదకి విసిరాడు. అప్పటికే ప్రమాదాన్ని గ్రహించిన విశాల్ మొహం వెనక్కి తిప్పుకున్నాడు. వెనుక జుట్టు క్షణాల్లో కాలిపోయింది. మెడమీద చర్మం భగ్గుమంది.

డాక్టర్ విశాల్ కేకల్ని రాజు కేకలు అధిగమించాయి . జనం ఇంకా దిగ్భ్రాంతి నుంచి తేరుకోలేదు.

నా కళ్ళు నా కళ్ళు అని అరుస్తున్నాడు అంధుడైపోయిన రాజు.

డాక్టర్ విశాల్‌కి అంత ప్రమాదం జరగలేదు కానీ, జుట్టంతా కాలిపోయి మరింత వికృతంగా తయారయ్యాడు. డీప్‌షాక్‌లో వున్నాడు.

సోమం జనంలో కలిసిపోయాడు.

మధూహ రాజు దగ్గరకి పరుగెత్తింది. అతడి మొహాన్ని తన చేతుల్లోకి తీసుకుంది.

ఎంత కాదనుకున్నా అతడు ఒకప్పుడు తన స్నేహితుడు. కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకున్నవాడు.

వీటన్నింటికన్నా ఎక్కువగా స్త్రీ సహజమైన జాలి, ప్రేమ, కరుణ భావాలు ప్రేమా ముప్పిరికొనగా అతడిని తన గుండెలకి హత్తుకుని "ఊరుకో రాజూ, దిగులు చెందకు. నేను లేనూ" అంటూ ఓదార్చసాగింది.

ఆ క్షణం అతడి స్థితి చూసి ఆమె కరిగిపోయింది. కొన్నాళ్ళ క్రితం అతడన్న మాటలూ తనని తిరస్కరించిన విధానం అన్నీ మర్చిపోయింది.

నిస్సహాయుడై విలపిస్తున్న తన స్నేహితుడిని ఓదార్చటంలో ఆమె పూర్వపు ప్రేమ పొంగి పొర్లింది.

స్త్రీ కున్న ఏకైక బలహీనత అది. పురుషుడు ఎన్ని మాయమాటలు చెప్పినా ఎన్ని అబద్దాలు చెప్తున్నాడని తెలిసినా మళ్ళీ మళ్ళీ అతడిని క్షమిస్తుంది.

పూర్ణమైన మనసుతో అతడిని ప్రేమిస్తూనే ఉంటుంది. తన ప్రేమతో అతడిని గెలవాలనుకుంటుంది. అతడు ఎప్పటికయినా తన పంథా మార్చుకుంటాడనీ తనే అతడుగా జీవిస్తాడనీ భావిస్తుంది,

మనుష్యులు ముఖ్యంగా మగవాళ్ళు అంత తొందరగా మారతారా?
కాలమే నిర్ణయించాలి.

## అయిదో అధ్యాయం

లక్ష్మి మొహం తెల్లగా, రక్తం లేనట్టుగా పాలిపోయింది. ఆమె చేతిలో ఉత్తరం వణుకుతోంది. ఆ రోజే పోస్టులో వచ్చిందది. అందులో ఇలా వుంది.

"తిండి బట్ట ఇల్లు సంసారం సమాజంలో స్థానం భర్త ఇస్తాడు. సుఖం మాత్రం ప్రియుడు ఇస్తాడు. నీ స్నేహితుడి గురించి ఆలోచనలు మానెయ్యక పోయినా అర్థరాత్రిళ్ళు అతడికి ఫోన్ చేసి పిలిపించుకున్నా నీ జీవితం నాశనం అయిపోతుంది జాగ్రత్త".

పర్వత శిఖరం విరిగిపోయి నిలువునా సమాధి చేసిన అనుభూతి. వళ్ళంతా చెమటలు. ఆమె ఆ ఉత్తరం చూసి ఎంతగా బెదిరిపోయిందంటే దాదాపు పావుగంట వరకూ కాళ్ళు చేతులూ ఆడలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఇదంతా తన భర్తకి తెలిసినట్టు... అతడు తనని నిలదీసి అడిగినట్టు... అబద్ధం చెప్పలేక తను నిజం వప్పుకున్నట్టు... అతడు తనకి విడాకులు ఇచ్చినట్టు.... సమాజమంతా తనని వేలెత్తి చూపుతున్నట్టు.... తను ఆత్మహత్య చేసుకున్నట్టు....

క్షణంలో ఇవన్నీ ఊహించుకుంది. ఎవరు వ్రాసి ఉంటారిది? ప్రహసిత్ అర్ధరాత్రి తనింటికి వచ్చాడన్న విషయం ఎవరికి తెలిసి వుంటుంది? ప్రహసిత్ ఎవరికయినా చెప్పి వుంటాడా?

ఆ ఆలోచన రాగానే వణికిపోయింది. పొరపాటున నోరు జారాడా? అనుకోగానే ఆ విషయం తెలుసుకునేవరకూ మనసాగలేదు.

ఫోన్ దగ్గిరకి వెళ్ళి రిసీవర్ ఎత్తి మళ్ళీ ఆగిపోయింది. తమ టెలిఫోన్ ఎవరైనా టాప్ చేశారేమో.... ఈ ఆలోచన ఆమెకి మరింత భయం కలిగించింది. తలుపు తాళం వేసి పక్క వీధిలో వున్న టెలిఫోన్ బూత్‌కి వెళ్ళి అక్కడనుంచి ప్రహసిత్‌కి ఫోన్ చేసింది.

ఆమె దగ్గిరనుంచి రెండోసారి టెలిఫోన్ వస్తుందని వూహించని ప్రహసిత్ కంగారుపడ్డాడు "ఏమిటి విషయం" అని అడిగాడు.

" నేను అర్జెంటుగా మిమ్మల్ని కలుసుకోవాలి".

" ఏమిటి? ఎనీ ప్రోబ్లెమ్?"

" ఫోన్‌లో చెప్పలేను. వెంటనే కలుసుకోవాలి" అంటూ తనెక్కడుందో చెప్పి అతడింకేదో అడగబోతూంటే ఫోన్ పెట్టేసింది.

ప్రహసిత్ కంగారుపడ్డాడు. ఆమెకు కూడా అలాంటి ఉత్తరం వచ్చిన సంగతి తెలీదు. తనకు వచ్చిన ఉత్తరం సంగతి ఆమెకి తెలిస్తే బెదిరిపోతుందని భయపడ్డాడు. అందుకే ఇంతకాలం ఆ ఉత్తరం సంగతి చెప్పలేదు. ఇంతకీ ఆ ఉత్తరం ఎవరు వ్రాశారో

తెలీదు. చుట్టుపక్కల వాళ్ళు ఎవరయినా వ్రాశారేమో అనుకున్నాడు. ఈ సారి ఆమెని ఇలాంటి ఇబ్బందిలో పడేయటం ఇష్టం లేకపోయింది. అందుకే తన కారులో వెళ్ళకుండా అదే దార్లో వున్న మరో స్నేహితుడి ఇంటి దగ్గిర తన కారు వదిలేసి అతడి కారులో బయల్దేరాడు. కిటికీలకి నల్లగ్లాసులున్నాయి.

టెలిఫోన్ బూత్ దగ్గిర ఆమె ఎదురుచూస్తోంది.

వెళ్ళి పక్కగా ఆపాడు. ఆమె కూర్చున్నాక కారు వేగంగా పోనిచ్చాడు. వెనుక తనని ఎవరూ ఫాలో అవటంలేదని నిర్ధారణ చేసుకుంటే మంచిదనిపించింది. ఊరి పొలిమేరలు దాటేవరకూ ఏమీ మాట్లాడలేదు.

ఆమెని చూస్తూంటే ఏ క్షణమైనా బరస్ట్ అయ్యేట్టు వుంది. ఆమె కాస్త మానసికంగా సర్దుకునే వరకు ఆగటం మంచిదనిపించింది.

ఊరి చివర డాబా లాంటి రెస్టారెంట్ ఉంది.

ఆ కాంపౌండ్‌లో కారు ఆపాడు. అప్పుడు కూడా తమనెవరూ ఫాలో అవటం లేదని నిశ్చయించుకున్నాడు.

రెస్టారెంట్ నిర్మానుష్యంగా వుంది. వెయిటర్ వచ్చాక "రెండు ఐస్‌క్రీం" అన్నాడు.

"నాకేమీ వద్దు" అంది లక్ష్మి.

" ఫర్వాలేదు" అని వెయిటర్ వెళ్ళిపోయాక ఆమెవైపు తిరిగి " ఇప్పుడు చెప్పండి. ఏమిటంత అర్జెంటుగా రమ్మన్నారు?" అని అడిగాడు.

ఆమె మౌనంగా తన చేతిలోని ఉత్తరాన్ని అతని ముందుకు జరిపింది.

అది చదువుతూండగానే అతని మొహంలో రంగులు మారాయి. తన భావాలు బయటకు కనిపిస్తే ఆమె మరింత బెదిరిపోతుందని "మీ ఇంటి చుట్టుపక్కల వాళ్ళు

ఎవరో చూసివుంటారు. వాళ్ళే వ్రాసి వుంటారు, ఇలాంటి శాడిస్టులు ఉండటం చాలా సహజం" అన్నాడు.

వెయిటర్ ఐస్‌క్రీం తెచ్చిపెట్టాడు. "తీసుకోండి" అన్నాడు ప్రహసిత్ వద్దు అన్నట్టు తల అడ్డంగా ఆడించింది.

ప్రహసిత్ ఆమె వైపు సానుభూతిగా చూశాడు. ముందుకు వంగి. "చూడండీ" అన్నాడు "మనం మన మనసుకి సాక్షి. అంతేగాని ఎవరేమనుకుంటారు అని భయపడకూడదు. మిమ్మల్ని చూసి ఓర్వలేని వారెవరో ఈ ఉత్తరం వ్రాసి వుంటారు. అంతకన్నా దీనివలన వచ్చే ప్రమాదం ఏమీ ఉండదు. అనవసరంగా మనసు పాడు చేసుకోకండి" అని ధైర్యం చెప్పటానికి ప్రయత్నించాడు.

పైకి అలా అన్నాడేకానీ ఆమె భయాన్ని అర్థం చేసుకోలేనంత అనుభవరహితుడు కాదు అతడు. అలాంటి ఉత్తర మొక్కటి ఆమె భర్తకి చేరితే దాని పరిణామం ఎలా వుంటుందో ఊహించగలడు. అదంతా సరే. ఆమె సంగతే అర్థం కావటం లేదు. ఏమీ మాట్లాడటం లేదు. మూర్తీభవించిన ఇంట్రావర్ట్‌లా వుంది. ముకుళించుకుపోయి కూర్చొని వుంది. ఇలాంటి ఇంట్రావర్ట్‌లతో దేన్నైనా చర్చించటం కష్టమే. తమ అభిప్రాయాలు అసలు చెప్పరు. మనసులో ఏమి ఆలోచిస్తున్నారో అసలు వెల్లడి చేయరు.

వెయిటర్ బిల్ తీసుకువచ్చి పెట్టాడు. దాన్ని పే చేసి వచ్చి కారులో కూర్చున్నారు.

ఇప్పుడు విషయం తెలిసింది కాబట్టి ఈ సారి మరింత జాగ్రత్తగా తమనెవరయినా పరిశీలిస్తున్నారేమోనని గమనించాడు.

ఎవరూ లేరు.

అంతలో తన భయానికి తనకే నవ్వొచ్చింది. అప్పుడంటే అర్థరాత్రి ఆమె భర్త లేనప్పుడు తను వెళ్ళటం ఎవరో చూసి వుంటారు. ఇప్పుడు ఎవరికి తెలుస్తుంది?

ఊళ్ళోకి వెళ్ళాక "ఎక్కడ దింపను" అని అడిగాడు.

“ ఇక్కడ దిగిపోతాను” అంది. అతడు కారు పక్కకి తీసి ఆపు చేశాడు. ఆమె కారు దిగుతూండగా చుట్టు చూశాడు.

అంతా హడావుడిగా ఎవరి పనుల్లో వారున్నారు.

## 2

అక్కణ్ణుంచి ఆమె ఆటోలో ఇంటికి వెళ్ళేసరికి అక్కడ మధూహ ఎదురు చూస్తోంది.

“ఇల్లు తాళం వేసి వుండేసరికి ఇప్పుడే వెళ్ళిపోదామనుకుంటున్నాను” అంది.
లక్ష్మికి తన స్నేహితురాలిని చూడగానే ఎందుకో చాలా రిలీఫ్‌గా అనిపించింది. ఆమె చాలా వరకూ గుంభనంగా వుంటుంది. కానీ ప్రస్తుతం ఆమె చాలా విపరీతమైన మానసిక వత్తిడిలో ఉంది. తనకీ భర్తకీ వున్న దూరం గురించి కూడా చెప్పకుండా ఆపుకోలేని స్థితిలో వుంది.

మధూహ చేతిలో ఆకాశరామన్న ఉత్తరం పెట్టి మొత్తం జరిగినదంతా చెప్పింది. అందులో సగం మధూహకి తెలిసిందే. అయినా తెలియనట్టే వింది. ప్రహసిత్‌కి కూడా అలాంటి ఉత్తరం ఒకటి వచ్చిందని చెప్పలేదు లక్ష్మికి. ఆ ఉత్తరాన్నే చూస్తూ వుండిపోయింది.

రెండు చేతివ్రాతలూ ఒక్కటే.
కానీ.... కానీ....
ఆ చేతివ్రాత ఎక్కడో చూసింది.
ఎక్కడ?

అదే అంతు పట్టటం లేదు. తనకీ లక్ష్మికీ తెలిసిన వాళ్ళు ఎవరున్నారు అని ఆలోచించింది. ఇంత పనిగట్టుకుని ఎవరు వ్రాస్తారు?

లక్ష్మి జరిగిన కథంతా ఇంకా చెపుతూనే వుంది. దాని కన్నా మధూహ ఆలోచన వేరే చోట వుంది.

ఈ వ్రాత తను ఎక్కడ చూసింది.

తనకు తెలిసిన వాళ్ళలో ఇంత రాక్షస మనస్తత్వం వున్నవాళ్ళు ఎవరు?

ఏం ఆశించి ఈ ఉత్తరం వ్రాశారు?

లక్ష్మి నుంచి వాళ్ళు ఏం ఆశిస్తున్నారు?

లేదా లక్ష్మి శ్రేయోభిలాషులా?

ఈ లోపులో లక్ష్మి అడిగింది "నన్నేం చేయమంటావు చెప్పు?"

ఆలోచన్లలో వుండి మధూహ సరిగ్గా వినిపించుకోలేదు. లక్ష్మి అదే ప్రశ్న రెట్టించి " ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు. సుఖంగా వుండేదాన్ని అనవసరంగా ఇందులో ఇరుక్కుపోయాను" అంది.

ఈ సారి బిత్తరపోవటం లక్ష్మి వంతయింది.

మధూహ అదే ఆవేశంతో అంది " అవును. ఇంతకాలం నీది, విష్ణుదీ ఆదర్శమైన దాంపత్యమని, వేళ్ళమీద లెక్క పెట్టదగ్గ సుఖమైన సంసారాల్లో ఒకటనీ అనుకున్నాను. కానీ ఇప్పుడు నువ్వు చెబుతున్నది వింటూంటే ఈ ప్రపంచంలో చాలా మందిలాగే నువ్వుకూడా లోపల ఎన్ని స్పర్థలున్నా పైకి సంతోషంగా కనపడే దంపతుల్లాగే ప్రొజెక్టు చేసేందుకు తాపత్రయపడుతున్నావని అర్థమైంది".

లక్ష్మి కొద్దిసేపు మౌనంగా వుండి నెమ్మదిగా " ఏమంటావు? మేము సుఖంగా లేం అని  అంటావా".

"అవసరం లేదు కానీ ఇందులో నీ తప్పేమీ లేదని నువ్వు మనస్ఫూర్తిగా నమ్ముతున్నావే. అదీ తప్పు నువ్వు అర్థరాత్రి ప్రహసిత్‌కి ఎందుకు ఫోన్ చేశావ్? అంటే నీలోనే అంతర్గతంగా ఆ కోరిక వుందన్నమాట".

లక్ష్మి దెబ్బతిన్న లేడిలా చూసింది. అప్రయత్నంగానే ఆమె కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. వణుకుతూన్న కంఠంతో " నా మంగళసూత్రం మీద ఒట్టేసి చెబుతున్నాను. నాకు అటువంటి కోరికేమీ లేదు" అంది.

"లేకపోవచ్చు. లేదా అలాంటి కోరిక వున్నా తరతరాలుగా నీ నరనరాల్లో జీర్ణమైపోయిన సంస్కృతి నిన్ను నైతికమైన బంధాల్తో కట్టి పడవేసి వుండవచ్చు. ఈ కోరిక అనేది ఎంత 'జాణ' అంటే అసలది తన స్వరూపాన్ని మనకెప్పుడూ స్పష్టంగా తెలుపదు. మనకు మనమే అది మనలో లేదు అని స్పష్టంగా నమ్మేటంతగా మనలో నిబిడీకృతమై వుంటుంది. దాన్ని ఆత్మవంచనతో కప్పిపుచ్చేసి మనమెంతో గొప్పవాళ్ళమని మన స్ఫూర్తిగా మనమే నమ్మటం కన్నా మూర్ఖత్వం ఇంకొకటి లేదు" అంది.

" ఇప్పుడు నన్నేం చేయమంటావ్?"

"ఆ కోరికని మనసులోంచి బయటకు తియ్యి. ఎదురుగా నిలబెట్టు. అంతేకానీ దాన్ని మనసులోనే పెంచి పెద్ద చెయ్యటమో అక్కడే కృశించిపోతుందిలే అని నిర్లిప్తంగా వుండిపోవటమో చేయకు. దానితో యుద్ధం చెయ్యాలంటే దానితో ముఖాముఖి తలపడాలి. అంటే దాన్ని బయటకు తీసి స్పష్టంగా చూడగలగాలి. అలా చెయ్యటాన్నే సెల్ఫ్ రియలైజేషన్ అంటారు" ఆమె ఆగి కొనసాగించింది.